31వ వసంతంలోకి
# చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల
బుధవారం 03 డిసెంబర్ 2025 పేజీలు : 8

## రాష్ట్రంలోనే జగిత్యాలకు అత్యధిక నిధులు

◆జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, డిసెంబర్ 2 :** జగిత్యాల పట్టణ అభివృద్ధి కి 62 కోట్ల నిధులు మంజూరు చేయటం జరిగిందని, ఈ నిధులు రాష్ట్రంలోనే అత్యధిక నిధులు జగిత్యాలకు మంజూరు చేయించడం జరిగిందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ వెల్లడించారు. మంగళవారం జగిత్యాల పట్టణంలోని 14వ వార్డులో 15 లక్షలతో సీసీ రోడ్డు డ్రైనేజీ అభివృద్ధి పనులకు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ స్పందన మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, ఆడువాల జ్యోతి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ లు కూతురు పద్మ, బద్దం జగన్, మోహన్ రెడ్డి, కూతురు రాజేష్, కోరే గంగమల్లు, పిట్ట ధర్మరాజు, పంబాల రాము, తిరుమలయ్య, గంగన్న, లింగారెడ్డి, చెట్పల్లి సుధాకర్, కూతురు శేఖర్, దుమాల రాజ్ కుమార్, డి ఈ ఆనంద్, ఏ ఈ అనిల్, మున్సిపల్ సిబ్బంది. మహిళలు తదితరులు పాల్గొన్నారు.




# స్థానిక పోరులో వీడీసీ 'జులుం'

- ఇదేమిటని ప్రశ్నిస్తే బహిష్కరణలు.
- పెద్దరికంతో విడిసిల దబాయింపు
- సర్పంచ్ పదవి వేలంతో వెలుగులోకి
- జగ్గాసాగర్ విడిసి పై పోలీస్ స్టేషన్లో పిర్యాదు



**జగిత్యాల ప్రతినిధి, చురకలు న్యూస్ :** గ్రామపెద్దలు,పెత్తం దారులగుప్పిట్లో ఉన్న వీడీసీ జులుం ఒకటి వెలుగు చూసింది.తాము చెప్పిందే వేదం,చేసిందే చట్టం అంటూ జగ్గా సాగర్ గ్రామంలో వీడీసీ ఎన్నిక జరుగ కుండా అడ్డుకున్నారు.ఈ కథంతా పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కింది.ఇంకా చెప్పాలంటే జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజక వర్గంలోని మెట్ పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో వీడీసీ సభ్యులు సమాంతర పాలన సాగిస్తున్నారు. ఇంకా చెప్పాలంటే దాదా గిరి చెలాయిస్తూ పంచాయతీ ఎన్నికల్లో తమ నయా దొరతనం ప్రదర్శిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మావొయిస్ట్ ప్రాబాల్య ప్రాంతాల్లో జనతాన్ సర్కార్ మాదిరిగా కోరుట్ల నియోజకవర్గం లోని పలు మండలాల్లో విడిసి ల పాలానా కొనసాగుతుంది.ఈ నియోజక వర్గం లోని పలు మండలల్లో దేవాలయాల నిర్మాణల నుండి మొదలుకొని నిర్వహణ, ఉత్సవాలనిర్వహణ,వేలం పాటల నిర్వహణ వరకు వి, డి, సి ల నెత్రుత్వంలో జరుగుతున్నాయి.గ్రామం లో చికెన్, మటన్, దుకాణల, ఏర్పాటు, ట్రాక్టర్ ల నిర్వహణ, పొలాలు దున్నడం, ఆర్, యం, పి దావఖణాల నిర్వహణ, వంటివి కాకుండా, ప్రభుత్వం అనుమతి తో ప్రారంభంచే మీ సేవ కేంద్రాలు కుడా, ప్రభుత్వం అనుమటించిన విడిసి ల అనుమతి తప్పని సరి, ప్రభుత్వం నిషేదించిన మద్యం బెల్ట్ షాపులు కుడా విడిసిల అనుమతితో ఈ ప్రాంతంలో కొనసాగుతున్న యంటే విడిసి ల పెతనం ఏ స్థాయిలో -2లో

## జిల్లావ్యాప్తంగా ముమ్మర వాహనాల తనిఖీలు

◆జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, డిసెంబర్ 2 :** సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం కొడిమ్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా బార్డర్ వద్ద ఏర్పాటు చేసిన దొంగల మర్రి చెక్పోస్టును ఎస్పీ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని, నగదు, మద్యం, ఉచిత పంపిణీలు, ఇతర ప్రలోభాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతున్నదని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున పోలీసులు అన్ని శాఖల సమన్వయంతో ఎన్ఫోర్స్మెంట్ డ్రైవ్ను కఠినంగా అమలు చేస్తున్నామన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టే ఏ చర్యలకు కూడా ఎవరూ పాల్పడవద్దని, ఎన్నికలకు సంబంధించి అక్రమంగా నగదు, మద్యం లేదా వస్తువులు తరలిస్తే, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సరైన ఆధారాలు లేకుండా భారీ మొత్తంలో డబ్బులు తీసుకెళ్తే సీజ్ చేయడం జరుగుతుందని, అత్యవసర అవసరాలకు నగదు తీసుకెళ్తే తగిన బిల్లులు, పత్రాలు వెంట ఉంచుకోవాలని ఎస్పీ సూచించారు. చెక్పోస్ట్ వద్ద సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా, పకడ్బందీగా తనిఖీ చేయాలని, అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మల్యాల సీఐ రవి, ఎస్ఐ సందీప్, చెక్పోస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

## సోదరుడి హత్య : ఇన్సూరెన్స్ డబ్బుల కోసం ఘోరం

◆రోడ్డు ప్రమాదంలా చిత్రీకరించేందుకు యత్నం
◆ముగ్గురు నిందితుల అరెస్ట్
◆కరీంనగర్ పోలీసు కమీషనర్ - గౌష్ ఆలం




**చురకలు క్రైమ్ ప్రతినిధి, కరీంనగర్, డిసెంబర్ 2 :** ఆర్థిక ఇబ్బందుల ఊబిలో కూరుకుపోయిన ఓ వ్యక్తి,ఏకంగా తన అన్ననే అత్యంత కిరాతకంగా హత్య చేసి,దాన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి,పెద్ద మొత్తంలో ఇన్సూరెన్స్ డబ్బులు కొట్టేయాలని పన్నిన కుట్రను కరీంనగర్ జిల్లా పోలీసులు ఛేదించారు.రామడుగు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ కేసులో, ప్రధాన నిందితుడితో సహా ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

**రూ. 1.50 కోట్ల అప్పులు, రూ. 4.14 కోట్ల ఇన్సూరెన్స్**

రామడుగు గ్రామానికి చెందిన మామిడి నరేష్ (30) వ్యాపారాల్లో, ముఖ్యంగా షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి సుమారు రూ. 25 లక్షలు నష్టపోయాడు.టిప్పర్ వాహనాల ఇ ఎం ఐ లు సహా మొత్తంగా రూ. 1.50 కోట్ల అప్పుల్లో చిక్కుకున్నాడు. ఈ అప్పుల నుంచి బయటపడేందుకు నరేష్ దుర్మార్గమైన ప్లాన్ చేశాడు.నరేష్ తన అన్న, మానసిక పరిపక్వత లేని మామిడి వెంకటేష్ (37) పేరుపై ఏకంగా రూ. 4 కోట్ల 14 లక్షల విలువైన పలు ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకున్నాడు. ఇందులో ఐసీఐసీఐ, ఆదిత్య బిర్లా, టాటా ఏఐజీ, ఎస్‌బీఐ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ వంటి సంస్థల నుంచి ఒక్కొక్కటి కోటికి పైగా విలువైన పాలసీలు ఉన్నాయి.దీంతో పాటు,అన్న పేరుపై రూ. 20 లక్షల గోల్డ్ లోన్ కూడా తీసుకున్నాడు. 2లో

## జిల్లా పరిధిలో పీటి పోలీస్ యాక్ట్ అమలు

-జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**చురకలు ప్రతినిధి,జగిత్యాల, డిసెంబర్ 2 :** శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల (డిసెంబర్ 1వ తేది నుండి 31 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.పీటి పోలీస్ యాక్ట్ ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు,రాస్తా రోకోలు, నిరసనలు,ర్యాలీలు,పబ్లిక్ మీటింగ్లు,సభలు,సమావేశాలు నిర్వహించరాదని, నిబంధనలకు విరుద్ధంగా డి.జె వినియోగించరాదని తెలిపారు.శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా,ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు.జిల్లా ప్రజలు పోలీసు వారికి ఈ విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

## ప్రిన్సిపాల్కు జన్మదిన శుభాకాంక్షలు

-టిజిపిఏ రాష్ట్ర నాయకులు దార మధు



**చురకలు ప్రతినిధి కమాన్పూర్ (మంథని) డిసెంబర్ 2 :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల బాలుర మంథని ప్రిన్సిపాల్ ఉటూరి శ్రీనాథ్ కు మంగళవారం రోజున జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మరియు పేరెంట్స్ కమిటి చైర్మన్ దార మధు అనంతరం మాట్లాడుతూ.. ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో, సుఖసంతోషాలతో,నిండునూరేళ్ల జీవించాలని అలాగే అత్యున్నత పదవులను అదిరోహించాలని కోరుకోవడం జరిగింది.ఈ కార్యక్రమం లో సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ నవీన్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ రవి, పేరెంట్స్ కమిటి సహాయ కార్యదర్శులు కల్వల రమేష్,కోమటికుంట సతీష్లు పాల్గొన్నారు.

# సోదరుడి హత్య : ఇన్సూరెన్స్ డబ్బుల కోసం ఘోరం

**మొదటి పేజీ తరువాయి...** వెంకటేష్ చనిపోతే ఇన్సూరెన్స్ డబ్బులు వస్తాయి,లోన్ మాఫీ అవుతుంది అనే దురుద్దేశంతో ఈ ఘాతుకానికి తెగబడ్డాడు.

**ప్లాన్ అమలు – టిప్పర్తో హత్య**

ఈ కుట్రలో తన స్నేహితుడు నముండ్ల రాకేశ్ (సహాయం చేసిన వ్యక్తి), టిప్పర్ డ్రైవర్ మునిగాల ప్రదీప్ను భాగం చేశాడు. ఈ ప్లాన్కు సంబంధించిన చర్చల వీడియోను రాకేశ్ తన ఫోన్లో భద్రపరిచాడు.తేదీ 29-11-2025 రాత్రి,ప్లాన్ ప్రకారం ...డ్రైవర్ ప్రదీప్ టిప్పర్ (TS-02-UD-6261)ను మట్టి లోడ్తో రామడుగు శివారులోని భారత్ పెట్రోల్ పంప్ వద్దకు తీసుకొచ్చాడు.ముందుగా అనుకున్నట్లుగా,బ్రేక్ డౌన్ అయినట్లు నటించి, నరేష్కు ఫోన్ చేశాడు. ?నరేష్ తన అల్లుడు సాయి ద్వారా వెంకటేష్ను జాకీ ఇచ్చి టిప్పర్ వద్దకు"జాకీ పెట్టాలి"అనే సాకుతో పంపాడు?నరేష్ అక్కడికి చేరుకున్నాక,టిప్పర్ స్టార్ట్ చేసి ఉంచి,జాకీని టైర్ కింద పెట్టి తిప్పమని తన అన్న వెంకటేష్కు చెప్పాడు. వెంకటేష్ సెల్ ఫోన్ లైట్ పెట్టుకొని జాకీ తిప్పుతుండగా,నరేష్ స్వయంగా టిప్పర్ను నడిపి,జాకీ తిప్పుతున్న అన్న వెంకటేష్ పైకి ఎక్కించాడు.దీంతో వెంకటేష్ అక్కడికక్కడే మరణించాడు. డ్రైవర్ ప్రదీప్ను పారిపోవాలని చెప్పి, నరేష్ దీన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు.

**అల్లుడి సాక్ష్యంతో ఛేదన**

వెంకటేష్ మృతిపై నరేష్ కుటుంబ సభ్యులకు, పోలీసులకు డ్రైవర్ యాక్సిడెంట్ చేశాడని చెప్పగా, నరేష్ అల్లుడు సాయి... టిప్పర్ను నడిపింది నరేషే అని తన తండ్రి మామిడి నర్సయ్యకు చెప్పాడు. దీంతో నర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేశారు. ?మృతదేహ పంచనామా, స్థల పరిశీలన, సాక్ష్యాల సేకరణ అనంతరం, ప్రమాద ఘటనపై అనుమానాలు కలగడంతో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఈ రోజు (02-12-2025) ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు నేరాన్ని అంగీకరించారు.నిందితుల నుంచి హత్య కుట్ర వీడియో ఉన్న మొబైల్ ఫోన్, ఇన్సూరెన్స్ పాలసీలు, బ్యాంకు పాస్ బుక్స్ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఏ.సి.పి విజయ కుమార్ గారి ఆధ్వర్యంలో, ఇన్స్ పెక్టర్ శ్రీ ప్రదీప్ కుమార్, ఎస్.ఐ. రాజు మరియు సిబ్బంది ఈ కేసును ఛేదించడంలో కృషి చేశారు. వీరిని కరీంనగర్ కమిషనర్ ఆఫ్ పోలీస్ అభినందించారు. నిందితులపై సంబంధిత సెక్షన్లలో కేసు నమోదు చేసి రిమాండ్కు పంపించారు. మరిన్ని సాంకేతిక ఆధారాల కోసం దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

# ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న బిజెపి ప్రభుత్వం

-పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ




**చురకలు ప్రతినిధి కమాన్పూర్ డిసెంబర్ 2 :** పార్లమెంటులో ప్రతిపక్షాల గొంతును అధికార బిజెపి పార్టీ గొంతు నొక్కుతోందని పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆరోపించారు. న్యూ ఢిల్లీలో జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల సందర్భంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రజా సమస్యలను బలంగా లేవనెత్తుతూ వరుసగా ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్.ఐ.ఆర్ వంటి ప్రజలకు సంబంధించిన కీలక అంశంపై నిరంతరం ఆందోళనలు చేపడుతు న్నామని ఎంపీ చెప్పారు.ప్రతిపక్ష పార్టీలకు మాట్లాడే అవకాశాన్ని నిరోధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఎంపీ వంశీకృష్ణ విమర్శించారు."పార్లమెంట్లో మా సమస్యలు, ప్రజల సమస్యలుముఖ్యంగా కామన్ మ్యాన్ సమస్యలను ప్రస్తావించ డానికి కూడా మాకు పూర్తి అవకాశం ఇవ్వడం లేదు.మా లీడర్ ఆఫ్ అపోజి షన్ రాహుల్ గాంధీ దాదాపు 60 కోట్ల ప్రజలను ప్రతినిధ్యం వహిస్తున్నారు. అయినప్పటికీ అపోజిషన్ వాయిస్ను అణచివేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి" అని పేర్కొన్నారు.పెద్దపల్లి ప్రజల ప్రధాన డిమాండ్ అయిన కొత్త ఎయిర్పోర్ట్ ఏర్పాటుపై కేంద్రంపై ఒత్తిడి కొనసాగిస్తున్నామని ఎంపీ తెలిపారు. సివిల్ ఏవియేషన్ మంత్రి రామ్మోహన్ నాయుడు ని పలుమార్లు కలిసి, పెద్దపల్లి ఎయిర్పోర్ట్కు ఆమోదం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు వెల్లడించారు.ఎయిర్పోర్ట్ ప్రాజెక్టుకు అవసరమైన ప్రీ-ఫీజిబిలిటీ స్టడీ కోసం తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే రూ. 50 లక్షలు కేంద్రానికి పంపిందని ఎంపీ గుర్తుచేశారు."రేపో, ఎల్లుండో ఫీజిబిలిటీ స్టడీ పూర్తవటం ద్వారా పెద్దపల్లి ఎయిర్పోర్ట్కు ముందడుగు పడే అవకాశం ఉంది. ఇది జిల్లాకు పెద్దగా అభివృద్ధిని తీసుకువస్తుంది" అని ఎంపీ వంశీకృష్ణ అన్నారు.ఎంపీ ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ,"మీ నమ్మకానికి ఎల్లప్పుడూ నిలబడతాను. ప్రజల కోసం మా పోరాటం మరింత బలంగా కొనసాగుతుంది" అని చెప్పారు.

# స్థానిక పోరులో వీడీసీ 'జులుం'

**మొదటి పేజీ తరువాయి...**

ఉందో తెలుస్తుంది. సమంతర పాలన నిర్వహిస్తున్న విడిసి ల మాట చట్ట విరుద్దంగా ఉన్నా పేడ చేవినా పెడితే ఆకుటుంబం, అవ్యక్తులు సాంఘిక బహిష్కరణ కు గురి కాక తప్పని పరిస్థితులు నెలకొన్న ప్రభుత్వ యంత్రాంగం విరి ఆగడలపై కొరడ ఝులాపించక పోవడంతో ఈ సారి గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను కూడా రాజ్యాంగ విరుద్దంగా నిర్వహించే స్థాయుకు చేరుకున్నాయని విమర్శలు వస్తున్నాయి. మెట్ పల్లి మండలం జగ్గా సాగర్ గ్రామానికి సర్పంచ్ గా ఎవరు ఉండాలన్నది వీడీసీ కమిటీ సభ్యులే ఖరారు చేశారు.ఇది ఒక ఊరు అని కాదు,జగిత్యాల జిల్లాలో పలు గ్రామాల్లో ఇలాంటి వీడీసీ సర్కార్ ఏర్పాటు చేయడం ఆయా గ్రామాల్లో పెత్తనం చెలాయించడం సర్వసాధారణ విషయమే అయినప్పటికీ అధికారులు మాత్రం స్పందించడం లేదు.రాజ్యాంగబద్దంగా జరగాల్సిన ఎన్నికలకు విరుదంగా, పౌరుడి ఓటు హక్కును కించపర్చేలా మండలంలోని జగ్గసాగర్ సర్పంచి పదవికి వేసిన వేలంపాట విమర్శలకు దారి తీస్తుంది. వివరాల్లోకి వెళితే జగ్గసాగర్ గ్రామ సర్పంచ్ పదవిని వేలం వెయ్యగా అదే గ్రామానికి చెందిన కొందరు గ్రామస్తులు సర్పంచ్ పదవి వేలంను రద్దు చేయాలని వాదించినందుకు గ్రామ విడీసీలు తమను గ్రామ బహిష్కరణ చేశారని ఆరోపిస్తూ మంగళవారం మెట్పల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అయితే గ్రామ వీడీసీలు సర్పంచ్ పదవిని గురేటి కాపు వర్గానికి చెందిన వారికి మరియు మహిళలకు, గ్రామస్తులకు ఎలాంటి సమాచారం లేకుండానే వేలంపాటలు నిర్వహించడంతో పాటు మంగళవారం ఉప సర్పంచ్ పదవితో పాటు వార్డు సభ్యుల పదవులను సైతం వేలంపాట నిర్వహిస్తున్నారని సమాచారం తెలిసి చురకలు లో ప్రచురితమైన కథనానికి స్పందించిన మండల అధికారులు గ్రామంలో సర్పంచి వేలంపాటపై విచారించారు. అయితే అంతటితో ముగియకుండా వేలంపాటను ధిక్కరించిన వారితో మాట్లాడొద్దని కిరణం షాపుల్లో నిత్యవసర వస్తువులు, డాక్టర్లు, మీ సేవలో సైతం ఇలాంటి పనులు చేయరాదని అలాగే వేలం పాటలో వచ్చిన డబ్బులు గురిట్టి కాపు వర్గానికి కాకుండా మిగతా వారికి చెందుతాయని చెప్పి హుక్కుం జారీ చేశారని ఆరోపించారు.జగ్గాసార్ గ్రామ శివారులో వరద కాలువ కొరకు సేకరించిన మిగిలిన ప్రభుత్వ భూమిని చాలా సంవత్సరాల నుంచి గ్రామంలోని పశువుల కొరకు గ్రామ రైతులతో వాడుకుంటున్నామని ఇప్పుడు ఆ మిగిలిన ప్రభుత్వ భూమిని సైతం గ్రామ వీడీసీలు సంఘాల వారిగా పంచుకొని సొంతం చేసుకోవాలని చూడగా దానిని వ్యతిరేకించిన ఓ వర్గం వారిని ప్రధాన విడిసీలో కొందరు గ్రామ బహిష్కరణ చేసి వేధిస్తున్నారని ఆరోపిస్తూ మెట్పల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.ప్రజాస్వామ్య బద్దంగా వేలంపాటను రద్దుచేసి యధావిధిగా ఎన్నికలను నిర్వహించాలని అధికారులకు సైతం వినతిపత్రం అందజేసి అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు గురిటి కాపు సంఘం సభ్యులు తెలిపారు.

బయట చెబితే సాంఘిక బహిష్కరణ.!!

అయితే గ్రామస్తులు ఎవరైనా వీడీసీ సభ్యుల నిర్ణయాన్ని తప్పు పట్టిన,ఎదురించిన..అధికారులకు సమాచారం అందించిన వారిపై చర్యలు తీసుకుంటామని పలు సందర్భాల్లో హెచ్చరించారు .వీడిసి మాటను ధిక్కరించిన 5లక్షల జరిమానా విధిస్తామని సాంఘిక బహిష్కరణ చేస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం .దీనిపై జిల్లా అధికార యంత్రాంగం కోరుట్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఓ కన్నేసి ఉంచాలని వీడీసీ పై కట్టడి చర్యలు తీసుకోవాలని గ్రామంలో ప్రజాస్వామ్య బద్దంగా ఎన్నికలు జరిగేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.జిల్లా యంత్రాంగం ఈవిషయం పై పూర్తిస్థాయి విచారణ జరిపి విడిసిలను కట్టడి చేయక పోతే రాజ్యాంగం కలిపించిన హక్కులు అనగాదొక్కే ప్రమాదం ఉందని పలువురు పేర్కొంటున్నారు

# పూత - పిందే దశలలో మామిడి తోటల సంరక్షణ

**-ఖచ్చితమైన సస్యరక్షణ మార్గదర్శకాలు**
**-ధర్మపురి ఉద్యానాధికారి ఎం. అర్చన**

**రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్**

డిసెంబర్ మాసం మామిడి పంటలో అత్యంత కీలకమైన సంక్రమణ దశగా, ఈ కాలంలో వాతావరణ పరిస్థితుల ప్రభావంతో పూత, కోలు రెండూ కలగలిసి రావడం రైతులను చాలాసార్లు సందిగ్ధంలో పడేస్తుందని, పూతకు ముందు, పూత సమయంలో, పిందే దశలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు సమయానుకూలంగా అమలు చేసినపుడే చెట్టు శక్తి నిలకడగా ఉండి పంట నిల్వ శాతం పెరుగుతుందని, ముఖ్యంగా డిసెంబర్‌లో పూతకు దోహదపడే జీవక్రియలు సున్నితమైనవిగా ఉండటంతో,చెట్టు నీటి వినియోగం, పోషకాల శోషణ, పీడక-వ్యాధుల ప్రభావం అన్నీ సమతుల్యంగా ఉండాలని ధర్మపురి ఉద్యానాధికారి ఎం. అర్చన సూచిస్తున్నారు.మామిడి తోటల్లో పూత దశకు ముందు లోతైన దుక్కులు, దున్నడం వంటి నేలను గందరగోళపరిచే పనులు చేయకూడదు. నవంబర్ నుండి డిసెంబర్ రెండవ వారం వరకు తోటను బెట్టగా ఉంచడం అత్యంత అవసరం. ఈ నీటి నియంత్రణ ద్వారా చెట్టులో పూత ప్రస్ఫుటంగా రావడానికి అనుకూలమైన శారీరక స్థితి



ఏర్పడుతుంది. పూత రాకముందే ఒకసారి ప్రొఫినోఫాస్ ఒక లీటరు, సల్ఫర్ 1.5 కిలోలు, వేప నూనె 1000 ppm ఒక లీటర్ ట్రాక్టర్ డ్రమ్ముకు కలిపి పిచికారి చేయడం ద్వారా ఆరంభ దశలో ఉండే చీడపీడలను సమర్థవంతంగా అరికట్టవచ్చు.కొన్ని తోటల్లో చెట్లకు సగం పూత, సగం కోలు ఉన్నట్లుగా గమనించినపుడు, డిసెంబర్ మొదటి వారంలో 13.0.45 ఐదు కిలోలు, బోరాన్ ఒక కిలో ట్రాక్టర్ డ్రమ్ములో కలిపి పిచికారి చేయడం ద్వారా పూతను ఒకేసారి సమపాళ్లలో తెప్పించే అవకాశం ఉంటుంది. తోటలో పూత లేదా మొట్టెలు గణనీయంగా కనిపించిన తర్వాత మాత్రమే నీటిని అందించాలి. అది కూడా మొదటి వారం పలుచని నీటి తడులుగా ఉండాలి. అకస్మాత్తుగా అధిక నీరు ఇస్తే చెట్టులో జరిగే సడన్ ఫిజియాలాజికల్ మార్పుల వల్ల పూత రాలిపోవడం ఖాయం. రెండు పలుచని తడులు ఇచ్చిన తర్వాతే పూర్తి నీటి తడిని ఇవ్వాలని ఉద్యానాధికారి సూచిస్తున్నారు.పూత నలుపు రంగు పట్టి రాలిపోవడం సాధారణంగా రాత్రి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోవడం వల్ల లేదా హోప్పర్స్, గుర్రపు పురుగు, తేనెమంచి పురుగుల తీవ్ర ప్రభావం వల్ల జరుగుతుంది. పచ్చి పూత దశలో థియోమెథాక్సామ్ 200 గ్రాములు, హెక్సాకనాజోల్ ఒక లీటర్, వేపనూనె 1000 ppm ఒక లీటర్ ట్రాక్టర్ డ్రమ్ములో కలిపి పిచికారి చేయాలి. పూత పూర్తిగా విచ్చుకొని తెల్లదశకు చేరినపుడు ఇమిడాక్లోప్రిడ్ 150 మిల్లీ లీటర్లు, హెక్సాకనాజోల్ ఒక లీటర్ లేదా నేటివో 250 గ్రాములు, వేపనూనె ఒక లీటర్ కలిపి పిచికారి చేయడం మంచిది.పిందే రాలిపోవడానికి పోషక లోపాలు ప్రధాన కారణం. పదవ సంవత్సరంలో ఉన్న చెట్లకు 2 కిలోల యూరియా, 6 కిలోల సూపర్, 1.5 కిలోల పొటాష్ ఇవ్వాలి.జూన్-జూలైలో కొమ్మ కత్తిరింపుల అనంతరం 2/3 భాగం, జనవరి-ఫిబ్రవరిలో కాయ బఠానీ గింజ దశలో 1/3 భాగం అందించాలి.హార్మోన్ల అసమతుల్యతతో పాటు సూక్ష్మపోషకాల్లో లోపం వల్ల కూడా పిందే పసుపురంగు తీసుకొని రాలిపోతాయి. ఈ సమస్య నివారణకు బఠానీ గింజ నుండి నిమ్మకాయ దశ వరకు రెండు సార్లు 13.0.45 2.5 కిలోలు, ఫార్ములా-4 2.5 కిలోలు, ప్లానో ఫిక్స్ 100 మిల్లీలీటర్ల మిశ్రమాన్ని ట్రాక్టర్ డ్రమ్ములో కలిపి పిచికారి చేయాలి.పిందే దశలో పదవ సంవత్సర చెట్లకు బోరాక్స్ 150 గ్రాములు, జింక్ సల్ఫేట్ 150 గ్రాములు కొమ్మ కత్తిరింపుల అనంతరం లేదా కాయ బఠానీ గింజ పరిమాణంలో ఉన్నప్పుడు అందించడం ద్వారా పిందే రాలే సమస్యను తగ్గించవచ్చు. అక్టోబర్-నవంబర్ మాసాల్లో బెట్ట అనంతరం రైతులు ఒకేసారి అధిక నీరు ఇవ్వడం అత్యంత ప్రమాదకరం. వీలైనంత మెల్లగా, పలుచని తడులతోనే నీటి సరఫరా ప్రారంభించి, తోట పరిస్తితిని పరిశీలించిన తరువాతే పూర్తి నీటి తడికి మారాలి.పూత నుండి పిందే దశ వరకు చెట్టు శారీరక మార్పులు ఎంతో సున్నితమైనవై ఉండటం వల్ల, సముచిత సస్యరక్షణ చర్యలు, సమతుల పోషక అందజేత, సరైన నీటి నిర్వహణ, చీడపీడల నియంత్రణఈ నాలుగు అంశాలు సమగ్రంగా అమలు చేసినప్పుడే మామిడి పంటలో స్థిరమైన దిగుబడి సాధ్యమవుతుంది. రైతులు ఈ మార్గదర్శకాలను పాటించడం ద్వారా పూత నాణ్యత పెరిగి, పిందే నిల్వ శాతం మెరుగుపడి, మొత్తంగా తోటల ఉత్పత్తిశక్తి అధికమవుతుందని ఉద్యానాధికారి అర్చన వివరించారు.

# కమనీయం శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం

**-ప్రత్యేక అలంకరణలో స్వామి వారు**
**-భక్తులకు అన్నప్రసాద వితరణ,ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు**

**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం డిసెంబర్ (02) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ధర్మారం వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు చక్రపాణి మాదవచార్యులు, రవీందర్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారి కళ్యాణ క్రతువు కన్నుల పండువగా సాగింది. అంతకుముందు స్వామివారి తలంబ్రాలు మంగళ వాయిద్యాలతో గ్రామం నుంచి ఉత్సవ కమిటీ సభ్యులు స్వామి వారి ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం వెంకటేశ్వర స్వామి వారు గుట్టపై నుండి కళ్యాణమంటపానికి మంగళ వాయిద్యాలు, మేల తాళాలతో కళ్యాణ





మండపానికి చేరుకున్నారు స్వామివారి కళ్యాణాన్ని గ్రామ ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తండోపతండాలుగా వచ్చి స్వామివారి కళ్యాణాన్ని తిలకించారు. ఆంధ్ర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగిందీ. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రేపు పొలాసలో లక్ష్మీ సరస్వతీ హోవనం

**-లలితామాత ఆలయ ఫౌండర్ చైర్మన్ స్వరూప**



**జగిత్యాల ప్రతినిధి :** ఈ నెల 4 గురువారం పౌర్ణమి సందర్భంగా పొలాసలోని లలితమాత ఆలయంలో శ్రీ లలితా మూలమంత్ర సహిత లక్ష్మీ సరస్వతీ హోవన కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నామని 108 శ్రీ చక్ర సహిత లలితామాత ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ చెల్లం స్వరూప తెలిపారు. లలితామాత ఆలయంలో ప్రతి ఫౌర్ణమి రోజున హోమం, యజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంగళవారం స్వరూప తెలిపారు.శ్రీ నంబీ వేణుగోపాలాచార్య కౌశిక మంగళశాషణంలతో హోవన కార్యక్రమాన్ని తీగుళ్ల విషు శర్మ నిర్వహిస్తారని స్వరూప వివరించారు.గురువారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే హోమంలో భక్తులు పాల్గొనాలని స్వరూప సూచించారు.

## నామినేషన్ కేంద్రాలను సందర్శించిన పరిశీలకులు




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, డిసెంబర్ 2 :** పంచాయితీ ఎన్నికల జిల్లా జనరల్ పరిశీలకులు జి.రమేష్ రెండవ విడత నామినేషన్ల స్వీకరణ జరుగుతున్న జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం, చల్ గల్ కేంద్రాలను సదర్శించారు.ఈ సందర్భంగా నామినేషన్ల ప్రక్రియ తీరును, ఆన్లైన్ డేటా ఎంట్రీ నీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ ప్రక్రియను వేగవంతంగా జరుగుతున్నందుకు ఎంపిడివో ను, ఆ కేంద్రాల ఆర్వోలు, పంచాయతీ సెక్రెటరీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్ లను అభినందించారు. అనంతరం జనరల్ అబ్జర్వర్ మాట్లాడుతూ నామినేషన్ ల ప్రక్రియ సజావుగా జరిగే విధంగా అధికారులందరు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రూరల్ ఎంపిడివో ఎస్.రమాదేవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నియమాక పత్రం అందుకున్న నందయ్య



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, డిసెంబర్ 2 :** హైదరాబాద్లోని గాంధీభవన్లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో మంగళవారం టిపిసిసి విస్తృతస్థాయి సమావేశం జరుగగా జగిత్యాల జిల్లా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజెంగి నందయ్య పాల్గొన్నారు. ఈ మేరకు జగిత్యాల డీసీసీ అధ్యక్షులుగా నియమితులైన గాజెంగి నందయ్యాకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నియామక పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు, సీఎంలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే విధంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల అధ్యక్షులు కృషి చేయాలని మండల, బ్లాక్ కాంగ్రెస్ కమిటీలు తొందర్లోనే న పూర్తిస్థాయిలో నియమించాలని రాబోవు స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించే విధంగా డిసిసి అధ్యక్షులు సమన్వయంతో కృషి చేయాలని పిలుపిచ్చారు.

### డిసెంబర్ 6న శ్రీ మహాశక్తి దేవాలయంలో

# అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం

**-కావేటి పరమేశ్వర్ గురుస్వామి ఆధ్వర్యంలో వైభవంగా జరిగే పడిపూజకు ఏర్పాట్లు ప్రారంభం**

**-పడిపూజలో పాల్గొననున్న కేంద్ర మంత్రి బండి సంజయ్**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ డిసెంబర్ 2 :** కరీంనగర్‌లోని ముగ్గురు అమ్మవార్లు శ్రీ మహాదుర్గ,శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతిల మహిమాన్విత దివ్య క్షేత్రంలో ఈనెల (డిసెంబర్) 6వ తేదీన శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజను నిర్వహించనున్నారు.శ్రీ శ్రీ శ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామి దివ్య ఆశీస్సులతో ఇట్టి పడిపూజ మహోత్సవ వేడుకలను కావేటి పరమేశ్వర్ గురు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించడానికి ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.6వ తేదీ శనివారం సాయంత్రం 6 గం.లకు జరిగే పడిపూజ కార్యక్రమంలో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ పాల్గొననున్నారు.పడిపూజ అనంతరం స్వాములకు అల్పాహారం అందించ డానికి తగిన ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.సమస్త జీవకోటిలో మానవజన్మ శ్రేష్ఠమైనది. తన జన్మను సార్ధకత చేసుకోవాలంటే, ముక్తిని సాధించాలనే ఉద్దేశంతో తీసుకునే దీక్ష "అయ్యప్ప స్వామి" దీక్ష. కలియుగంలో ఉత్తమమైన దీక్షగా భావించి కఠిన నియమాలను అనుసరిస్తూ బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ నియమనిష్ఠలతో దీక్షను కొనసాగిస్తూ స్వామిని దర్శించే గొప్ప దీక్ష,గురు స్వామి మాటపై గురి కలిగి ఉండే దీక్ష ,గురువుపై భక్తిని కలిగి ఉండే దీక్ష , బ్రహ్మ,విష్ణు,శివుల ప్రతిరూపముగా భావించి గురువు పైన విశ్వాసం కలిగి ఉండే దీక్ష "అయ్యప్ప స్వామి దీక్ష" , కులము,మతము,జాతి అనే భేదం లేకుండా తీసుకునే ఏకైక దీక్ష "అయ్యప్ప దీక్ష".శ్రీ అయ్యప్ప స్వామి కరుణాకటాక్షాలు సమస్త భక్తజనులు, అయ్యప్ప దీక్షపరుల పట్ల ఉండాలనే సంకల్పంతో శ్రీ మహాశక్తి దేవాల యంలో చేపట్టనున్న ఈ పడిపూజ మహోత్సవ వేడుకకు హిందూ బంధువులందరూ తరలివచ్చి ఆ స్వామి కృపకు పాత్రులు కాగలరని ఆలయ నిర్వాహకులు కోరారు.



# పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

**-కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**-గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (పెద్దపల్లి) డిసెంబర్ 02 :** పంచాయతీ ఎన్నికలకు పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణ శ్రీ తో కలిసి పంచాయతీ ఎన్నికల నిర్వహణ పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలకు మరో 9 రోజుల సమయం ఉందని, రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు, ఇతర సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని అన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ కల్పించాలని, రెండవ దశ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తయిన తర్వాత పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు.నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత నిబంధనల ప్రకారం పోటీ చేసే అభ్యర్ధుల ప్రకటన, గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పేపర్ ముద్రణ ప్రణాళిక చేసుకోవాలని అన్నారు. బ్యాలెట్ బాక్సుల తరలింపు కోసం రవాణా సౌకర్యాలు కల్పించాలని అన్నారు.ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ప్రచార ఖర్చుల వివరాలు నమోదు చేసేందుకు రిజిస్టర్ లు అందించాలని అన్నారు. పంచాయతీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ప్రచార వ్యయ వివరాలను రిటర్నింగ్ అధికారులు చెక్ చేసే విధంగా చూడాలని అన్నారు. ప్రతి అభ్యర్థికి వ్యయ వివరాలు అందించాలని నోటీసులు జారీ చేయాలని అన్నారు.ప్రతి మండలానికి బ్యాలెట్ బాక్సులు చేరుకోవాలని అన్నారు. మొదటి విడత పోలింగ్ జరిగే గ్రామాలకు బ్యాలెట్ బాక్సుల తరలింపు ప్రారంభించాలని అన్నారు. 21 కంటే ఎక్కువ అభ్యర్థులు గ్రామానికి లేదా వార్డుకు దరఖాస్తు చేసుకున్న సమాచారం అందించాలని కలెక్టర్ తెలిపారు.డిసెంబర్ 6న మండల స్థాయిలో పి.ఓ, ఏ.పి.ఓ లకు శిక్షణ నిర్వహించి, అక్కడే పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఓ.పి.ఓ లు డిసెంబర్ 6న మండల స్థాయిలో శిక్షణ వేదిక వద్దకు వచ్చి పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు.కౌంటింగ్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల వద్ద మంచి లైటింగ్ ఉండాలని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి. వీర బుచ్చయ్య, జిల్లా పరిషత్ సీఈవో నరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, జిల్లా సహకార అధికారి శ్రీమాల, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి అర్చరి పోటీలకు ఎంపికైన విద్యార్థిని



**చురకలు ప్రతినిధికమాన్ పూర్ డిసెంబర్ 2 :** కమాన్ పూర్ మండలం గుండారం గ్రామపంచాయతీ పరిధిలోని రాజాపూర్ కు చెందిన మచ్చ రవీందర్ కూతురు మచ్చ సహస్ర రాష్ట్రస్థాయి అర్చరి పోటీలకు ఎంపికయ్యారు. సెంటినరీ కాలనీలోని రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన కరీంనగర్ సీనియర్ ఉమ్మడి జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో ఉత్తమ ప్రతిభా కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైన మట్ట రమేష్, మచ్చ సహస్ర లు ఈనెల 7 తేదీన కొల్లాపూర్‌లో జరిగే సీనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ రవి,ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్ తెలియజేశారు. సహస్ర ఎంపిక పట్ల పలువురు సహస్రను అభినందించి శు భాకాంక్షలు తెలియజేశారు.

## విరాళం అందజేత



**చురకలు విలేకరి,మెట్‌పల్లి, డిసెంబర్ 2 :** మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్ల గ్రామానికి చెందిన భూరం చిన్న నర్సయ్య అనే వ్యక్తి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న చిన్ననాటి మిత్రులు తమ వంతు సాయంగా 2000-2001 బ్యాచ్ మిత్రులు రూ.1 లక్ష ఆర్థిక సాయాన్ని మంగళవారం అందించారు.

## మంత్రి అడ్లూరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు



**చురకలు విలేకరి, ధర్మపురి,డిసెంబర్ 2 :** మండలం లోని తీగల ధర్మారం గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమక్షంలో చేరారు. తీగల ధర్మారం మాజీ ఉప సర్పంచ్ పందిరి అశోక్, గూళ్ళ గంగన్న, మహ్మద్ షంషుద్దీన్, రషీద్ తో పాటు అనుచరులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి లక్ష్మణ్ కుమార్, మండల అధ్యక్షులు సంగనబట్ల దినేష్లు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి అందరూ కలసికట్టుగా పనిచెయ్యాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సంగం నర్సింహులు, పట్టణ అధ్యక్షులు చీసిరిశెట్టి రాజేష్, సింహారాజు ప్రసాద్, మాజీ సర్పంచ్ జంగిలి ప్రభాకర్, గంధం గంగన్న, జంగిలి రవీందర్, దాసరి పురుషోత్తం, అంకుస్, చాంద్ పాషా, సల్లూరి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## దత్తాత్రేయ స్వామి ఆలయంలో మంత్రి పూజలు



**చురకలు విలేకరి, ధర్మపురి, డిసెంబర్ 2 :** ధర్మపురి పట్టణంలోని శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని మంగళవారం రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అద్దూరి లక్ష్మణ్ కుమార్ సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి అడ్లూరికి ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**-అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**




**చురకలు ప్రతినిధి కరీంనగర్ డిసెంబర్ 2 :** గ్రామపంచాయతీ ఎన్నికల నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు.కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్లో మంగళవారం గ్రామపంచాయతీ ఎన్నికల నోడల్ అధికారులతో ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, పోలింగ్ వరకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లకూ తావివ్వకుండా, పారదర్శకంగా సజావుగా నిర్వహించాలని అన్నారు.ఎన్నికలకు అవసరమైన అన్ని మెటీరియల్స్ సిద్ధంగా ఉండాలన్నారు.మొదటి విడత పోలింగ్ డిసెంబర్ 11న,రెండవ విడత పోలింగ్ డిసెంబర్ 14న,మూడో విడత పోలింగ్ డిసెంబర్ 17న జరగనున్న దృష్ట్యా పిఓ ,ఏపిఓలకు,సూక్ష్మ పరిశీలకులకు మరోసారి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.నోడల్ అధికారులు అవసరమైతే వారి కార్యాలయం నుండి లేదా ఇతర సిబ్బందిని సహాయకులుగా నియమించుకోవాలన్నారు.ఈ సందర్భంగా బ్యాలెట్ పేపర్ల ముద్రణ,మెటీరియల్ మేనేజ్మెంట్, ఎన్నికల సిబ్బంది,జోనల్ అధికారుల నియామకం గురించి చర్చించారు. ఎక్కడా అలసత్వానికి తావివ్వవద్దని, ఎన్నికల పట్ల ఎవరైనానిర్లక్ష్యం వహిస్తే ఎన్నికల నియమాల ప్రకారం కఠిన చర్యలు ఉంటాయన్నారు.నోడల్ అధికారులు మరోసారి ఎన్నికల నియమ, నిబంధనలను క్షుణ్ణంగా సరిచూసుకొని పొరపాట్లు దొర్లకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఓ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, పంచాయతీ ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# వాళ్ళు డిగ్రీ పూర్తి చేసి 43 ఏళ్ళు

**-జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయి**
**-భావోద్వేగంతో ఉత్సాహంగా సాగిన పూర్వ విద్యార్థులు సమావేశం**
**-43 ఏళ్ల తర్వాత కలుసుకున్న జమ్మికుంట ఆదర్శ పూర్వ విద్యార్థులు**



**(కోరెం సుధాకర్ రెడ్డి, చురకలు ప్రతినిధి, హుజురాబాద్)**

1979 రోజులు.. ఆరోజుల్లో చదువుకోవడమే గొప్ప విషయం.. చదువు పట్ల అంత చైతన్యం లేదు.. అందులోనూ.. ఉన్నత విద్య కొందరు మాత్రమే చదివేవారు. గ్రామాల్లో ఉండాలని, వ్యవసాయ పనులు చూసుకోవాలని.. చదువు ఎందుకనే.. అభిప్రాయం ఆరోజుల్లో ఎక్కువగా ఉండేది. కానీ ఆరోజుల్లో హుజురాబాద్ ప్రాంతానికి చెందిన వారు 1979 లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన తర్వాత జమ్మికుంటలో నాడు ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్న ఆదర్శ డిగ్రీ కళాశాల లో డిగ్రీలో (బిఎస్సి బి జెడ్ సి)లో చేరారు. 1979–82లో డిగ్రీ పూర్తి చేసారు.చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులుగా,మరి కొందరు వ్యాపార రంగంలో స్థిరపడ్డారు.ప్రభుత్వ ఉద్యోగులుగా అధికారులుగా పనిచేసినవారు ఉద్యోగ విరమణ కూడా చేసారు. అందరూ..దాదాపుగా తాతలు కూడా అయ్యారు.ఐతే..ఇటీవల ఈ బ్యాచ్ లో కొందరు చొరవ తీసుకుని ఎవరెవరు ఎక్కడ ఉంటున్నారో తెలుసుకుని పూర్వ విద్యార్థులు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు.హనుమకొండ జిల్లా ఉనికిచెర్ల వద్ద ఉన్న ఓ ప్రయివేటు రిసార్టు దీనికి సోమవారం వేదికైంది. ఈ సందర్భంగా భావోద్వేగం పండింది. ఆనందభాష్పాలు రాలాయి.. ఒకరి నొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు.ఆలింగనం చేసుకున్నారు.. నాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు.. వయసును మరచి ఆట పాటలతో హోరెత్తించారు.నాటి అనుభవాలు పంచుకున్నారు. కాగా ఈ సమ్మేళనం మరపురానిదిగా వారికి గుర్తుండి పోయేలా చేసింది. ఇదే బ్యాచ్ లో నాలుగు పూర్వ విద్యార్థులు లక్నెపల్లి వెంకట రమణ రమణారావు (న్యాయవాది) భాస్కర్ రెడ్డి, ఆడెపు మహేందర్, శివరాం రెడ్డి మృతి చెందగా వారికి సంతాపం ప్రకటించి రెండు నిముషాలు మౌనం పాటించారు. వారి చిత్రపటాలు వద్ద నివాళులర్పించి భావోద్వేగానికి గురయ్యారు. గతంలో క్లాస్మేట్స్ ఎవరెవరు ఎక్కడెక్కడ ఉంటున్నారో తెలిసేది కాదని, తాము ఇలా ఒకేచోట కలుస్తామని కలలో కూడా ఊహించలేదని, ఇది తమకెంతో ఆనందాన్ని ఉత్సాహాన్ని ఇచ్చిందని, ఇక ముందు కూడా ఇలాగే వీలైనప్పుడు సమావేశాలు నిర్వహించుకుంటామని తెలిపారు. నాటి గురువులను, వారి మార్గదర్శనాన్ని, బోధనా అనుభవాలను, తీపి గుర్తులను, క్లాసులో జరిగిన అల్లరిని, చిలిపి చేష్టలను ఈ సందర్భంగా గుర్తు చేసుకుని తన్మయత్వం పొందారు. సుమారు 40 మంది పూర్వ విద్యార్థులు 43 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత కలవడం ఇది కలా.. నిజమా అన్న అనుభూతి కలుగుతోందని వ్యాఖ్యానించారు. సమావేశానికి సమన్వయ కర్తలుగా వ్యవహరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పూర్వ విద్యార్థుల సమావేశంలో హుజురాబాద్ కు చెందిన వ్యాపారవేత్త ఆడెపు సూర్యం, ముక్కెర కుమారస్వామి (విశ్రాంత ఈవో), విశ్రాంత ఉపాధ్యాయులు రవిశంకర్ శుక్లా, విశ్రాంత వార్డెన్ కుసుమ మల్లయ్య, విశ్రాంత ఎయిర్ ఫోర్స్ అధికారి చొల్లేటి శ్రీవాత్సవ, విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మటూరి శ్రీనివాస్, గాదె ప్రకాష్, ఒంటెల రమణా రెడ్డి, వీణవంక బుచ్చయ్య, వరంగల్ కిట్స్ లో ఫిజికల్ డైరెక్టర్ గా పనిచేస్తున్న పింగిళి రమేష్ రెడ్డి (వంగపల్లి) తదితరులు ఉన్నారు.




# అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు




**చురకలు ప్రతినిధి కరీంనగర్ డిసెంబర్ 2 :** కరీంనగర్ రూరల్ పరిధిలో పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నగనూరు గ్రామంలోని జిల్లా పరిషత్ స్కూల్ వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ ను పట్టుకున్నారు వివరాల్లోకి వెళితే నగునూర్ గ్రామానికి చెందిన బాతుల వీరయ్య అనునతడు ఎటువంటి అనుమతులు లేకుండా వాగు నుండి అక్రమంగా ఇసుకను తన ట్రాక్టర్ నందు కరీంనగర్ వైపుగా తరలిస్తుండగా కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు నిందితుడి పై కేసు నమోదు చేసి అట్టి ట్రాక్టర్ ను సీజ్ చేసి తదుపరి చర్య నిమిత్తం కోర్టుకు పంపనైనది. మరియు ఏం.ఆర్.ఓ గారి ముందు లక్ష రూపాయల పూచీకతు పై బైండోవర్ చేయడమైనది, మరియు సస్పెక్ట్ షీటర్స్ ను కూడా ఎలక్షన్ల నేపద్యం దృశ్య బైండోవర్ చేయడమైనది అని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్ రెడ్డి తెలిపారు.

## ప్రిన్సిపాల్ జన్మదిన వేడుకలు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ డిసెంబర్ 2 :** కమాన్‌పూర్ మండల కేంద్రంలోని కంఫర్ట్ గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాల్ అనకొండ వినయ్ కుమార్ 50వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.గత 25 సంవత్సరాలుగా మండల కేంద్రం లో ఎంతో మంది విద్యార్థులను ఉన్నతమైన వ్యక్తిగా తీర్చిదిద్దిన గొప్ప వ్యక్తిగా పేరు సాధించాడు.విద్య రత్న అవార్డు అందుకున్నారు.పేద విద్యార్థులకు కార్పొరేట్ విధ్యనుఅందిస్తున్నగొప్ప ఉపాధ్యాయుడు.ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది.

## అరెపల్లి వాగులో నిర్మించే శ్మశానవాటికను మరో ప్రాంతానికి మార్చండి

**- స్మశానవటికకు కేటాయించిన**

**రూ.49.50లక్షలు నిధులు వృథా కాకుండా చూడాలి**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ డిసెంబర్ 2 :** అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆరెపల్లి వాగులో ఒర్రెలో నిర్మించే వాగునా పార్టీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు కోమటి రెడ్డి తేజ్ దీప్ రెడ్డి, బండారి శేఖర్ బృందం సందర్శన చేయడం జరిగింది. స్మశానవటిక నిర్మాణం చేస్తున్న ప్రాంతాన్ని పూర్తిగా పరిశీలిన చేయడం జరిగింది. అనంతరం కోమటి రెడ్డి తేజ్ దీప్ రెడ్డి, బండారి శేఖర్ లు మాట్లాడుతూ ఆరెపల్లి ప్రజలకు ఉపయోగపడేలా స్మశానవటికను నిర్మించాలని అన్నారు. ఆరెపల్లి (ఒర్రెలో) వాగులో నిర్మించడం వలన కాంట్రాక్టర్ ను బతికాంచడం తప్ప ఎవ్వరికి ఉపయోగం ఉండదని అన్నారు. నగరపాలక సంస్థ ఇంగినిర్ లు , కాంట్రాక్టర్ కుమ్మకాయి వాగులో నిర్మిస్తున్నారని ఆరోపించారు. స్మశానవటిక నిర్మాణానికి నగరపాలక సంస్థ నుండి రూ.49.50లక్షలు నిధులు కేటాయించినరాని అన్నారు.ఒక్క వర్షంగట్టిగా పడితే కొత్తపల్లి చెరువు నుండి వాగు ఒర్రె ద్వారా వచ్చే నీటి ప్రవాహానికి పెద్దఎత్తున వాగు ఉప్పొంగి వాగులో నిర్మించిన స్మశానవాటిక కొట్టుకుపోతుందని అన్నారు. స్మశానవాటిక కోసం నిర్మించిన ప్రజాధనం 59.50లక్షలు వృధా అవుతాయి. ప్రజాధనం పూర్తిగా నీటిలో పోసిన పన్నీరు లాగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఆరెపల్లి గ్రామంలో మరొక ప్రాంతంలో స్మశాన వాటి నిర్మాణానికి ప్రభుత్వ స్థలం ఉన్నది.ఆ ప్రభుత్వ స్థలానికి వెళ్ళుటకు అవసరమైతే రైతులు 30 ఫీట్ల రోడ్డు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.ఆరెపల్లి స్మశాన వాటికను వాగులో కాకుండా మరో ప్రాంతానికి నిర్మించాలని డిమాండ్ చేశారు.లేదంటే మా పార్టీ ఆధ్వరంలో నగరపాలక సంస్థ ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## మంత్రి ఆశీస్సులతో విజయం సాధిస్తా



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ డిసెంబర్ 2 :** రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో విజయం సాధించి కల్వచర్ల గ్రామాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతానని కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న కల్వచర్ల గ్రామ సర్పంచ్ అభ్యర్థి ఒరే స్వరూప సదయ్య అన్నారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ సర్పంచ్ గా గెల్పొందిన అనంతరం మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో గ్రామ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు. అలాగే గ్రామంలో మిగిలిపోయిన పనులు మాజీ జెడ్పిటిసి గంట వెంకటరమణారెడ్డి సలహాలు సూచనలు తీసుకొని పూర్తిచేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే విజయం సాధించి తాను ఇచ్చిన హామీలు నెరవేరుస్తారని అన్నారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని పేర్కొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలు : పటిష్ట బందోబస్తుపై సీపీ సమీక్ష

**చురకలు ప్రతినిధి కరీంనగర్ డిసెంబర్ 2 :** గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అధికారులను ఆదేశించారు.ఎన్నికల బందోబస్తు ఏర్పాట్లపై సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన అధ్యక్షతన ఉన్నతాధికారుల సమీక్ష సమావేశం జరిగింది.




**పటిష్ట చర్యలపై దృష్టి**

సమావేశంలో సీపీ గౌస్ ఆలం గారు మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల వద్ద, ముఖ్యంగా సమస్యాత్మక మరియు అతి సమస్యాత్మక కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించాలని ఆదేశించారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్టమైన భద్రత కల్పించాలన్నారు.

**రూట్ మొబైల్‌పై ప్రత్యేక సమీక్ష**

ఎన్నికల బందోబస్తులో రూట్ మొబైల్ బృందాల పాత్ర అత్యంత కీలకమని సీపీ పేర్కొన్నారు. నిర్ణీత రూట్లలో మొబైల్ బృందాలు ఎప్పటికప్పుడు పెట్రోలింగ్ నిర్వహిస్తూ, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. బందోబస్తు విధుల్లో పాల్గొనే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అల్లర్లు, ఘర్షణలకు తావు లేకుండా కఠినంగా వ్యవహరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.సమీక్షా సమావేశంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు, ఏసీపీలు శ్రీనివాస్, విజయకుమార్, మాధవి, ఇన్స్పెక్టర్లు మరియు ఇతర ఎన్నికల విభాగాధిపతులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై సమరశంఖం

**-కరీంనగర్‌లో 'ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్ - సైబర్ క్లబ్' శిక్షణ ప్రారంభం**




**చురకలు ప్రతినిధి కరీంనగర్ డిసెంబర్ 2 :** మారుతున్న సాంకేతిక యుగంలో సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ శ్రీ గౌస్ ఆలం ఉద్ఘాటించారు. సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఘనంగా ప్రారంభమైన "Fraud Ka Full Stop - Cyber Club Training Programme" ను ఆయన లాంఛనంగా ప్రారంభించి, కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

**సైబర్ అవగాహన కీలకమన్న సీపీ:**

కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ, సైబర్ నేరాలు నిత్యం కొత్త రూపాలు సంతరించుకుంటున్న నేపథ్యంలో, సమాజంలో సైబర్ అవగాహన కల్పించడం ఎంతో కీలకమని పేర్కొన్నారు. కళాశాలల విద్యార్థులు, NCC మరియు NSS క్యాడెట్లు ముందుకొచ్చి ప్రజల్లో డిజిటల్ భద్రతపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. "ప్రతి ఒక్కరు సైబర్ సేఫ్టీ అంబాసిడర్లుగా ఎదగాలి" అంటూ విద్యార్థులను ప్రోత్సహించారు.


**సైబర్ సేఫ్టీ ప్రతిజ్ఞ:**

ఈ కార్యక్రమం సందర్భంగా, సైబర్ మోసాల నుండి ప్రజలు తమను తాము రక్షించుకునేందుకు వీలుగా రూపొందించిన "సైబర్ సేఫ్టీ ప్రతిజ్ఞ" ను పాల్గొన్న విద్యార్థులందరితో ప్రమాణం చేయించారు. వ్యక్తిగత సమాచారాన్ని జాగ్రత్తగా వినియోగించడం, అపరిచిత లింకులు నొక్కకపోవడం, ధృవీకరణ లేకుండా ఆన్‌లైన్‌లో డబ్బులు పంపకపోవడం వంటి ముఖ్యమైన అంశాలు ఈ ప్రతిజ్ఞలో భాగమని అధికారులు తెలిపారు.సైబర్ సేఫ్టీపై అవగాహన కల్పించే ఈ శిక్షణ కార్యక్రమాలు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆరు వారాల పాటు కొనసాగనున్నాయని అధికారులు వెల్లడించారు.ఈ ప్రారంభోత్సవంలో అడిషనల్ ఎస్పీ వెంకటరమణ, ఏసీపి శ్రీనివాస్ జి, సైబర్ క్రైమ్ ఏసీపీ కొత్వాల్ రమేష్,సీఐ సునీల్, ఐటి కోర్ ఇన్స్పెక్టర్ సరిలాల్, సైబర్ క్రైమ్ ఎస్ఐ జోష్న, ఎస్ఐ అనిల్ కుమార్, సైబర్ క్రైమ్ సిబ్బందితో పాటు పలు కళాశాలల విద్యార్థులు, NCC & NSS క్యాడెట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### హుజురాబాద్ నియోగాజకవర్గంలో

# రసవత్తరంగా పంచాయతీ రాజకీయాలు

**-పంచాయతీ ఎన్నికల వేళ.. గోడ దూకుతున్న నేతలు**



**(కోరెం సుధాకర్ రెడ్డి, చురకలు ప్రతినిధి, హుజూరాబాద్) :** హుజురాబాద్ నియోజకవర్గంలో గ్రామపంచాయతీ ఎన్నికల రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. ప్రతినిత్యం పార్టీల్లో చేరికలు జరుగుతున్నాయి. బి ఆర్ ఎస్ నుండి కాంగ్రెస్ లోకి, అలాగే కాంగ్రెస్ నుండి బిఆర్ఎస్ లోకి చేరికలు జరుగుతున్నాయి.ఇదిలా ఉంటె అభ్యర్థులను నిర్ణయించడం కాంగ్రెస్, బి ఆర్ ఎస్ నేతలకు సవాలుగా మారింది. ముఖ్యంగా జనరల్, బిసి స్థానాల్లో ఏకాభిప్రాయాలు కుదరడం లేదు. దీంతో ఏం నిర్ణయం తీసుకోవాలో తెలియని పరిస్థితి దాపురించింది. అధిష్టానం మాట వినని పరిస్థితి గ్రామాల్లో ఉంది. దీంతో పార్టీల్లో అయోమయం నెలకొంది. తాజాగా మంగళవారం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సమక్షంలో కిష్టంపేటకు చెందిన కాంగ్రెస్ నేత సిద్దంపల్లి మహిపాల్ రెడ్డి బి ఆర్ ఎస్ లో చేరగా.. రాజపల్లికి చెందిన కొందరు నేతలు నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. కాగా కొందరు గ్రామాభివృద్ధికి నిధులు ఇచ్చి ఏకగ్రీవం చేసుకునే పనిలో ఉన్నారు. ఈ విషయంలో అధికారులు ఏవిధంగా స్పందిస్తారన్నది చర్చనీయాంశమైంది. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ గ్రామ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. మద్యం అమ్మకాలు పెరుగుతున్నాయి. సమీకరణాలు ఊపందుకుంటున్నాయి. ఏదిఏమైనా రాజకీయ ఆధిపత్యం కోసం హుజురాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బి ఆర్ ఎస్ పాకులాడుతున్నాయి.



## సీపీ గౌష్ ఆలం పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు

**-నామినేషన్ కేంద్రాలు, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో భద్రతా ఏర్పాట్లు**



**చురకలు క్రైమ్ ప్రతినిధి,కరీంనగర్, డిసెంబర్ 2 :** కరీంనగర్ జిల్లాలో మూడు దశల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి, రెండవ విడత పోలింగ్ ప్రక్రియను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి పోలీసు కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం పటిష్ట చర్యలు చేపట్టారు. రెండవ విడత నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద, అలాగే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను సీపీ మంగళవారంనాడు స్వయంగా పర్యవేక్షించారు.

**రెండవ విడత నామినేషన్ కేంద్రాల వద్ద బందోబస్తు**

రెండవ విడత ఎన్నికలు జరగనున్న ఐదు మండలాలు – తిమ్మాపూర్, శంకరపట్నం, చిగురుమామిడి, గన్నేరువరం, మానకొండూరు – లలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది.నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ గౌష్ ఆలం తెలిపారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రశాంతంగా సాగేలా ఈ కేంద్రాల్లోని భద్రతా ఏర్పాట్లను ఆయన పలుచోట్ల తనిఖీ చేశారు.

**సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన**

ఎన్నికలు సజావుగా సాగేందుకు వీలుగా, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సీపీ సందర్శించారు. తిమ్మాపూర్ మండలంలోని నుస్తులాపూర్, నల్లగొండ, పర్లపల్లి, మొగిలిపాలెం గ్రామాల్లోబీ చిగురుమామిడి మండలంలోని రేకొండ, సుందరగిరి, బొమ్మనపల్లి గ్రామాల్లోబీ మరియు సైదాపూర్, సోమారం, శంకరపట్నం, తాడికల్ గ్రామాలతో పాటు పలుచోట్ల పోలింగ్ కేంద్రాలను సీపీ పరిశీలించారు.పోలింగ్ రోజు ఈ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలను మోహరించి, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

**బైండోవర్ చర్యలు, ప్రజల సహకారం**

ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినందున, శాంతిభద్రతల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని సీపీ గౌష్ ఆలం పేర్కొన్నారు. ఇందులో భాగంగా, గతంలో నేర చరిత్ర ఉన్న ఎన్నికల నేరస్థులను బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు.ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తూ, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా సీపీ విజ్ఞప్తి చేశారు.ఈ పర్యవేక్షణలో రూరల్ ఏసీపీ విజయకుమార్, హుజురాబాద్ ఏసీపీ మాధవి, ఇన్స్పెక్టర్లు సదన్ కుమార్ (తిమ్మాపూర్), వెంకట్ (హుజురాబాద్ రూరల్), ఎస్సైలు శ్రీకాంత్ (ఎల్.ఎం.డి), తిరుపతి (సైదాపూర్), సాయికృష్ణ (చిగురుమామిడి) లతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వెంకట్రావుపల్లిలో ఏకగ్రీవమేనా?

**-చక్రం తిప్పుతున్న కాంగ్రెస్ నేత పత్తి కృష్ణా రెడ్డి**



**(కోరెం సుధాకర్ రెడ్డి చురకలు ప్రతినిధి, హుజురాబాద్)**

హుజురాబాద్ మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవి ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. హుజురాబాద్ మండలంలో ఎన్నికలు మూడో ఫేజ్ లో డిసెంబర్ 17 న జరగనున్నాయి. నామినేషన్లు బుధవారం నుండి స్వీకరించనున్నారు. వెంకట్రావుపల్లి జనరల్ అయింది. గ్రామాభివృద్ధి కోసం విరాళం ఇచ్చేందుకు ముందుకు వచ్చిన వారిని సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు గ్రామస్తులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నేత, వ్యాపారవేత, కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్ ముఖ్య అనుచరుడు పత్తి కృష్ణా రెడ్డి సర్పంచ్ అయ్యేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం. ఇందుకు గ్రామస్తులతో చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా హుజురాబాద్ మండలంలో 1100 ఓటర్లు కల్గిన గ్రామ సర్పంచ్ పదవి ఏకగ్రీవం కానుండడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం అవుతోంది.

# మహా ధర్నా ఎవరికోసం? ఎందుకోసం?

**-మీ వైఫల్యాలను ప్రభుత్వంపై నెట్టాలని చూస్తున్నారా?**
**-మీ నాటకాలను జర్నలిస్టులు గమనిస్తూనే ఉన్నారు**
**-డబ్ల్యూజేఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్**




**చురకలు విలేఖరి,కరీంనగర్ డిసెంబర్ 2 :** తమ అసమర్ధతను, వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కొందరు జర్నలిస్టుల సమస్యలపై భారీ ధర్నా పేరుతో కొత్త నాటకాలకు తెరతీసారని వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్ ఆరోపించారు.వాస్తవానికి ఈ నాయకుల కారణంగానే రాష్ట్రంలోని మెజారిటీ జర్నలిస్టులు ప్రభుత్వానికి దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టులకు ప్రభుత్వానికి మధ్య అగాథం పెంచి ప్రస్తుతం దానిని తమ ప్రయోజనాలకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు.మంగళవారం కరీంనగర్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో రెండేళ్లుగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు రాకపోవడానికి కారణాలు,కారకులు ఎవరని ప్రశ్నించారు.అక్రిడిటేషన్ విధివిధానాలు నిర్ధారించడానికి ప్రభుత్వం నియమించిన కమిటీ ఇంతకాలం ఏం చేసిందని?ప్రశ్నించారు.అక్రిడిటేషన్ విధివిధానాల రూపకల్పన పూర్తయిందా? సంబంధిత నివేదిక ప్రభుత్వానికి సమర్పించారా? సమర్పిస్తే ప్రభుత్వమే కాలయాపన చేస్తుందా? వీటికి సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత రూపకల్పన కమిటీకి చైర్మన్గా ఉన్న వ్యక్తిపై ఉందన్నారు.తమ వైఫల్యాలను ప్రభుత్వంపై రుద్దేందుకు సంఘాల పేరుతో కొందరు ఆడుతున్న కపట నాటకాలను జర్నలిస్టు సమాజం గమనిస్తూనే ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం విషయంలో సమాచార శాఖ వైఫల్యం చెందిందని, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న వ్యక్తులు మాట్లాడడం, ప్రభుత్వ చలువతో అధికారంలోకి ఉండి అదే ప్రభుత్వం పై ధర్నాలకు ప్రోత్సహించడం కన్న విడ్డూరం మరొకటి ఉండబోదన్నారు.మీడియా అకాడమీ నిర్దిష్టమైన లక్ష్యాలతో ఏర్పడిందని, దానికి చైర్మన్గా నియమించే వ్యక్తులకు ఆ బాధ్యతలు కాకుండా సమాచార శాఖ నిర్వహించే బాధ్యతలు కూడా అప్పగించడం ప్రస్తుత దుస్థితికి కారణమని ఆయన అన్నారు.ఇకపై మీడియా అకాడమీకి నియమించే వ్యక్తులను కేవలం అకాడమీ పనులకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాహితం కోసం ప్రభుత్వం చేస్తున్న పనులకు తెలంగాణ జర్నలిస్టుల మద్దతు కూడ కట్టడంలో వైఫల్యం చెందిన కొందరు నాయకులు ఒకటి రెండు నెలల్లో ముగియబోతున్న తమ పదవులు కాపాడుకునేందుకు కొత్త వేషాలతో ముందుకు వస్తున్న విషయాన్ని రాష్ట్రంలోని జర్నలిస్టులు గమనించాలన్నారు.అలాంటి వ్యక్తులు జర్నలిస్టు సంఘాల కంటే,డ్రామా కంపెనీలు నడుపుకుంటే బాగుంటుందని సూచించారు.ఈ సమావేశంలో డబ్ల్యుజేఐ జిల్లా అధ్యక్షుడు దారం జగన్నాథరెడ్డి, ప్రధాన కార్యదర్శి గుడాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మొగురం రమేష్, కోశాధికారి చిటుమల్ల మహేందర్ పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలవేళ
# వీణవంక మండల కాంగ్రెస్‌కి భారీ షాక్



**చురకలు విలేఖరి వీణవంక డిసెంబర్ 02 :** స్థానిక సంస్థల ఎన్నికల ముందు కాంగ్రెస్ కు ఎదురు దెబ్బ తగిలింది. హుజురాబాద్ నియోజకవర్గం లోని వీణవంక మండలం కిష్టంపేటకు చెందిన మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సిద్ధపల్లి మహిపాల్ రెడ్డి హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నాడు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని,కాంగ్రెస్ పార్టీని ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ, కెసిఆర్ తోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందనే నమ్మకంతో పార్టీలో చేరానని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చాలా కష్టపడుతున్నారని, ఆయనకు నా వంతు సహాయం అందించాలని స్థానిక సంస్థల ఎన్నికలో అన్ని గ్రామాల సర్పంచ్‌లు బి ఆర్ఎస్ పార్టీ అభ్యర్థులే గెలుస్తారని కాంగ్రెస్ పార్టీ కి డిపాజిట్ కూడా రాదు అని బి ఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలిస్తేనే గ్రామాల అభివృధి జరుగుతుందని పార్టీలో చేరాను అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సీనియర్ నాయకుడు బండారి ముతయ్య బి ఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నిషేదాజ్ఞలు కొనసాగింపు

**-కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ డిసెంబర్ 2 :** సాధారణ పౌరులు, ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేదాజ్ఞలను ఈ నెల 31 వరకు పొడిగించడం జరిగిందని కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాధులు వస్తున్న నేపధ్యంలో ఈ చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు.మద్యం సేవించి మద్యం ప్రియులు వీధుల్లో,రోడ్లపై అసభ్యపదజాలంతో మాట్లాడుతుడటం, అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందిగా పరిణమించింది. మద్యంప్రియుల ఆగడాలకు కళ్ళెం వేయడంతోపాటు ప్రజల భద్రత,రక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది.పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాల పరిమితి పొడిగించబడే అవకాశం ఉంది.ఐపిసి 188.హైదరాబాద్ నగర పోలీసు చట్టం,ఫసలీ నిబంధనలను అనుసరించి నిషేదాజ్ఞలు ఉల్లఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

**శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు.**

కమీషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం తెలిపారు.శాంతిభద్రతల పరిరక్షణ చర్యల దృష్ట్యా నియమ నిబంధనలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.సంబంధిత ఏసీపీల నుంచి అనుమతి లేకుండా సభలు,సమావేశాలు,ఊరేగింపులను నిర్వహించకూడదని తెలిపారు.అనుమతులు లేకుండా ఎటువంటి సభలు సమావేశాలు,ర్యాలీలు నిర్వహించకూడదని సంబంధిత అధికారుల నుండి అనుమతులు తప్పనిసరి అని తెలిపారు అనుమతుల కోసం దరఖాస్తు చేయడం ద్వారా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అట్టి కార్యక్రమానికి తగిన విధంగా పోలీసుశాఖ భద్రతాపరమైన చర్యలు చేపడుతుంది అన్నారు.ఈ చట్టం అమలులో వుండగా ఇతరులను గాయపరిచే విధంగా ఉండే వస్తువులు, మారణాయుధాలను ధరించి సంచరించకూడదు.రోడ్లు, ప్రజలకు ఉపయోగపడే ఇతర స్థలాల్లో జనాన్ని సమీకరించకూడదు.జన సంచారం మరియు అనుమతి పత్రాలలో పేర్కొన్నబడిన ప్రాంతాలలో మ్యూజిక్‌లు, పాటలు,ప్రసంగాలు,రణగొణ ధ్వనులు చేయవద్దని కోరారు.ఈ ఉత్తర్వులు ఈనెల 31 వరకు అమల్లో ఉంటాయని తెలిపారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై హైదరాబాద్ నగర పోలీస్ చట్టం, 1348ఫసలీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమీషనర్ తెలిపారు.

**డిజెలపై వినియోగం పై నిషేధాజ్ఞలు పొడగింపు.**

కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో డిజె సౌండ్ వినియోగంపై అమల్లో ఉన్న నిషేదాజ్ఞలను ఈనెల 31 వరకు పొడగించడం జరిగిందని పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలుగకుండా శబ్దకాలుష్యం నుండి కాపాడేందుకు భారీ అసౌకర్యం తో కూడిన డిజె ధ్వని వినియోగంపై నిషేదాజ్ఞలు విధించడం జరిగిందని పేర్కొన్నారు.వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజల సమీకరణ, ప్రదర్శనల కోసం డిజె సౌండ్లను వినియోగిస్తున్న విషయం విదితమే. వివిధ కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ ల వినియోగం తప్పనిసరి అనిపిస్తే సంబంధిత డివిజన్ ఎసిపిల అనుమతి పొందాలని సూచించారు.ఏ ఏ ప్రాంతాల్లో ఏమేరకు ఏ స్థాయిలో మైక్ సెట్లు వినియోగించాలో పరిమితులున్నాయని, వాటికి లోబడి వినియోగించుకోవాలని, ముందస్తుగా అనుమతి పొందినట్లైతే వాటిని అనుసరించి భద్రత పరమైన సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం అని పేర్కొన్నారు.కమీషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు డిజెల వినియోగంపై యజమానులకు అవగాహన కల్పించడం జరిగిందని,పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాల పరిమితి పొడిగించబడే అవకాశం ఉంది. నిషేదాజ్ఞలు ఉల్లఘించే వారిపై ఐపిసి 188, హైదరాబాద్ నగర పోలీసుచట్టం,ఫసలి నిబంధనలను సరించి చట్టపరమైన చర్యలు తీసుకో వడం జరుగుతుంది. కమీషనర్ తెలియజేశారు.

**డ్రోన్ల వినియోగంపై నిషేదాజ్ఞలు**

కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో భద్రత కారణాల దృష్ట్యా పారాగ్లైడర్స్, రిమోట్ కంట్రోల్ డ్రోన్స్,రిమోట్ కంట్రోల్ మైక్రోలైట్ ఏయిర్ క్రాఫ్టల వినియోగాన్ని నిషేదించడం జరిగిందని కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నిషేదాజ్ఞలు ఈనెల 31వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.ఉగ్రవాదులు ,అసాంఘికశక్తులు వీటిని వినియోగించే అవకాశాలుండటంతో సదరు సాంకేతిక పరికరాల వినియోగాన్ని నిషేదించడం జరిగిందని తెలిపారు.ఎవరైనా వినియోగించదలచినట్లయితే సంబంధిత పోలీసుల అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు.నిబంధనలను ఉల్లంఘించిన వారిపై బిఎన్ ఎస్ సెక్షన్ 188 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# చొప్పదండి జాగృతిలో చేరికలు



**చురకలు ప్రతినిధి కరీంనగర్ డిసెంబర్ 2 :** చొప్పదండి మండలంలో ఈరోజు చొప్పదండి మండల ఇంచార్జ్ రంగరవేణి లక్ష్మణ్ ఆధ్వర్యంలో జాగృతిలో మండల కేంద్రానికి చెందిన డాక్టర్ మమత రెడ్డి మరియు రాంచంద్రారెడ్డిలపాటుమ్యాకల అరుణ్,గోగులకోండ మధు,గోగులకండ మహేందర్,గొల్లపల్లి రమేష్,బోడ రాకేష్ రెడ్డి తదితరులు చేరినారు. వారికి జాగృతి జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ కండువా కప్పి జాగృతిలోకి ఆహ్వానించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ చొప్పదండి నియోజకవర్గంలో జాగృతి బలోపేతంలో భాగంగా పలువురు నాయకులు కవితక్క నాయకత్వంలో పనిచేస్తామని ముందుకు రావడం ఆహ్వానించదగ్గ విషయమని వారు అన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో జాగృతి బలోపేతం చేసి త్వరలోనే అన్ని స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని గత ఇరవై సంవత్సరాలుగా జాగృతి తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల కాపాడడం కోసం పనిచేస్తుందని చొప్పదండి నియోజకవర్గంలో జాగృతికి బలమైన నిర్మాణం ఉందని. కవితక్క చేపట్టిన జనం బాట కార్యక్రమ అనంతరం ప్రజల నిర్ణయానికి అనుగుణంగా కవితక్క జాగృతిని రాజకీయ పార్టీలతో సమానంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికగా నిర్మాణం చేస్తుందని జాగృతి దృష్టికి ప్రజలు ఇప్పటికే అనేక సమస్యలను తీసుకు వస్తున్నారని కవితక్క వాటన్నిటికీ పరిష్కారానికి ప్రత్యేకమైన కార్యాచరణతో సంబంధిత శాఖల దృష్టికి, జిల్లా కలెక్టర్ దృష్టికి అధికారుల దృష్టికి తీసుకుపోయి వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నారని ఈ రాష్ట్రానికి కవితక్క నాయకత్వం వహిస్తే ప్రజా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ప్రజలు భావిస్తున్నారని జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, ఆదివాసి విభాగం జిల్లా అధ్యక్షులు కుతాడు శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు చంటి శ్రీనివాస్, చొప్పదండి మండల అధ్యక్షులు పిట్టల సత్యం తదితరులు పాల్గొన్నారు.